క్లుప్తంగా

దేవస్థానం చైర్మన్‌కు ఘన సత్కారం



దేవస్థానం చైర్మన్ నూకరత్నం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ చైర్మన్ బొందల నూకరత్నం, రాష్ట్ర శెట్టి బలిజ సంఘం డైరెక్టర్ రాజును ఘనంగా సత్కరించారు. రెండు సంవత్సరాల నుండి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి చైర్‌పర్సన్ నూకరత్నం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాశింబిల్లి మంగరాజు, మల్లేశ్వర్రావు, సత్తిబాబు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ వీధి పండగ



మోదకొండమ్మను దర్శించుకుంటున్న మిత్తిపాటి కుటుంబ సభ్యులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ వీధి పండగ బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మిత్తిపాటి కుటుంబ సభ్యులు అమ్మవారి ప్రతి రూపమైన 101 ఘటాలు శిరస్సున పెట్టుకుని మంగళ వాయిద్యాలు, నేల వేషాల నడుమ అమ్మవారి ఆలయానికి కాలి నడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దర్జీ కుటుంబానికి ఆర్థిక సాయం



దర్జీ శ్రీను కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టైలర్ల సంఘం సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలోని జేడీ పేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన మట్టా శ్రీను కుటుంబానికి మండల టైలర్ల సంఘం సభ్యులు రూ. 5 వేల నగదును బుధవారం అందజేశారు. సంఘంలో సీనియర్ సభ్యునిగా ఉంటు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన శ్రీను కుటుంబానికి అండగా వుంటామని యూనియన్ అధ్యక్షుడు ఒమ్మి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సూరిశెట్టి జగదీష్ పేర్కొన్నారు. శ్రీను పెద్ద కర్మ బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మట్టా చంటి, సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

దేవరాపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గౌతమి సాలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిని ఎస్ఐ డి.నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మద్యం, నాటుసారా అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి ఉక్కుపాదం మోపాలని ఆమె సూచించారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చోడవరం రూరల్: మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తాలని, వచ్చేనెల 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక మెయిన్ స్కూల్ ఆవరణలో వివిధ రంగాలకు చెందిన మహిళా కార్మికులతో సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

గవరవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చోడవరం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి.హేమంత్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం గవరవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీ, లేబరేటరీ, రికార్డులను పరిశీలించారు. సేవల పట్ల డీఎంహెచ్‌వో సంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట



చీడికాడలో ఆసరా చెక్కును మహిళలకు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఆసరా సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

- మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసాం
- వైఎస్సార్ ఆసరా సభలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: మహిళల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం చీడికాడలో నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సమావేశానికి ముందు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతు తన సుదీర్ఘ పాదయాత్రలో అక్క చెల్లెమ్మల సమస్యలు విన్న సీఎం జగన్ మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు నాలుగు విడతల్లో ఆసరా కింద వేస్తామని హామీ ఇచ్చి నేడు నెరవేరుస్తున్నారన్నారు. మూడవ విడత వైఎస్సార్ ఆసరాలో చీడికాడ మండలానికి 10,530 మందికి రూ. 6.75 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రతి సంక్షేమ పథకం అమలుకు తొలి సంతకం సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తే, రెండవ సంతకం తాను చేస్తానని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 78.94 లక్షల మంది మహిళా లబ్ధిదారులకు రూ. 6,419 కోట్లు అందజేసామన్నారు. ఆసరా ద్వారా తీసుకున్న అప్పును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీరుస్తుందన్నారు. సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద జానకీరామ్, ఎంపీపీ కురచా జయమ్మా నారాయణమూర్తి, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి కురచా వెంకటలక్ష్మి, మండల యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ధర్మిశెట్టి స్వాతి, కిముడు చిన్నమ్మలు, డీఆర్‌డీఏ ఏపీడీ డైసీ, తహసీల్దారు రాణి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రత్నప్రభ, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్

ఆసరా సభను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నాతవరం: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ నర్సీపట్నం క్లస్టర్ అధికారి సుదర్శన అన్నారు. వల్సంపేట గ్రామంలో బుధవారం ఆయిల్‌పామ్ జీడిమామిడి తోటల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ. 29 వేలు రాయితీ ఇస్తుందని, అందులో అంతర్ పంటల సాగుకు నాలుగేళ్ల వరకు హెక్టార్‌కు రూ. 21 వేలు ఉచితంగా ఇస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం అందించే అన్ని సేవలను సద్వినియోగం చేసుకునేందుకు స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ఎండాకాలంలో ఆరేళ్ల పైబడిన ఆయిల్‌పామ్ చెట్టుకు రోజుకు 300 లీటర్ల నీరు అందించాలన్నారు. తమ సూచనలు పాటిస్తే చక్కటి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి రవితేజ, రైతులు పాల్గొన్నారు.

24 వేల పశువులకు గాలికుంటు టీకాలు

కె.కోటపాడు : కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో 35,200 పశువులకు గాలికుంటు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతానికి 24 వేల పశువులకు టీకాలు వేసినట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి తెలిపారు. మండలంలో ఆర్లి, కె.సంతపాలెం, కింతాడ ఆర్బీకేలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆర్బీకేల పరిధిలో గల గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ సహాయకులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని 31లోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కింతాడలో ఆయన రైతులతో మాట్లాడుతూ వేసవిలో పశుగ్రాస సమస్య ఉంటుందని, దానిని అధిగమించేందుకు రాయితీపై అందిస్తున్న టీఎంఆర్ దాణాను రైతులు పశువులకు మేతగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు శివకుమార్, జగన్నాథం, త్రినాథరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

బుచ్చెయ్యపేట : వ్యవసాయంలో చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్. సత్తిబాబు, పి. బాబు, చోడవరం వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం మేజర్ పంచాయతీ వడ్డాదిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం జీడిమామిడిలో యాజమాన్య పద్ధతులు, పిందెలు, కాయలు రాలిపోకుండా తీసికోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో భాస్కరరావు, వ్యవసాయశాఖ సిబ్బంది దాసు, పలు గ్రామాల రైతు భరోసా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

గొలుగొండ: ప్రజల సమస్యలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి తెలిపారు. ఆమె గొలుగొండ మండలం జోగుంపేట, గాదంపాలెం గ్రామాల్లో పర్యటించారు. ముందుగా జోగుంపేటలో పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అధికారులతో మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నూరుశాతం ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం గాదంపాలెంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ రఘు, సర్పంచ్‌లు నల్ల బెల్లి శ్రీనివాసరావు, జువ్వల లక్ష్మి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర హోమం

మాకవరపాలెం: శివుడికి ఇష్టమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్దమిల్లు జంక్షన్‌లోని ఆలయంలో లక్ష్మీ హోమంతో పాటు, మృత్యుంజయ హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

అధికారులపై విప్ ధర్మశ్రీ ఆగ్రహం



పేట వద్ద రోడ్డు నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం విజయరామరాజుపేట, వడ్డాది కొత్తూరు, బంగారుమెట్ట, లోపూడి, శింగవరం, బుదిరెడ్లపాలెం, కొమళ్లపూడి తదితర గ్రామాల్లో గోతులమయంగా మారిన బీఎన్ రోడ్డును ఆయన ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ఆలస్యం కావడం పట్ల మండిపడ్డారు. జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వడ్డాది వైసీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేసినా..

చోడవరం: అనకాపల్లి మండలం దర్జీనగర్ నుంచి వయా వెంకన్నపాలెం, చోడవరం, వడ్డాది, రావికమతం, కొత్తకోట, రోలుగుంట మీదుగా నర్సీపట్నం వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 112 కోట్లు విడుదల చేసినా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోవడంతో సమస్యను అధికారులకు, సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్‌కు విప్ ధర్మశ్రీ బుధవారం చూపించి పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.

వచ్చే నెల నుంచి గొలుగొండ నుంచే ప్రాజెక్టు సేవలు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శ్రీగౌరి

నాతవరం: వచ్చే నెల నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు సేవలు గొలుగొండ మండలం నుంచి కొనసాగిస్తామని ప్రాజెక్టు సీడీపీవో కె. శ్రీగౌరి అన్నారు. మండలంలో గన్నవరం మెట్ట వద్ద సర్పంచ్ సత్యనారాయణ అధ్యక్షతన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి గొలుగొండ, నాతవరం మండలాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టుగా పరిగణిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత సమస్య ఉండదన్నారు. సూపర్‌వైజర్లు ఎ.నాగజ్యోతి ఎ.విజయలక్ష్మి, ప్రాజెక్టు బీపీఏ కిరణ్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్షా కేంద్రం నుండి ఆనందంగా బయటికి వస్తున్న విద్యార్థులు

మాడుగుల: స్థానిక జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ శ్రీలత ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిసాయి. బుధవారం నిర్వహించిన రసాయన శాస్త్రం, కామర్స్ పరీక్షల్లో 705 మంది హాజరు కావలసి ఉండగా ముగ్గురు గైర్హాజరు కాగా 702 మంది హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఇంటి దారి పట్టారు.

ఆరోపణల్లో నిజం లేదు

రోలుగుంట: అర్ల పంచాయతీ సివారు పీత్రిగెడ్డలో గల పది కుటుంబాలలో ఏడు కుటుంబాలకు రేషన్ అందుతుందని, పది కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని ఏపీ గిరిజన సంఘ సభ్యుడు కె.గోవిందరావు చేసిన ఆరోపణలో నిజం లేదని జిల్లా పౌర సరఫరా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కొర్రా కొండబాబు, కొర్రా లక్ష్మణరావు, మర్రి సీతమ్మ, కొర్రా జురప, కొర్రా వరహాలమ్మ, కొర్రా బుజ్జమ్మ, కిల్లో మాలి రేషన్ పొందుతున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. పై ఏడుగురిలో మర్రి సీతమ్మ కుమారుడికి, కిల్లో మాలి ఇద్దరు కుమారులు వెరసి ముగ్గురికి వివాహం జరిగినందున తల్లిదండ్రుల రైస్ కార్డుల నుంచి వారి పేర్లు తొలగించినట్లు తెలిపారు. వారి పేరిట కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరరావు చెప్పినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యాయం కోరుతూ రేషన్ వాహనాల ఆపరేటర్ల వినతి

రావికమతం: గ్రామాల్లో రేషన్ వాహనాల ద్వారా ప్రజల వద్దకే బియ్యం సరఫరా చేస్తున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నామని, ఈనెల 31లోగా పరిష్కరించకుంటే 1వ తేదీ నుంచి బియ్యం సరఫరా నిలిపివేస్తామంటూ వాహనాల ఆపరేటర్లు తహసీల్దార్ మహేశ్వరరావుకు బుధవారం వినతి అందించారు. తమకు వేతనాలు పడుతున్నా బకాయిల పేరుతో బ్యాంకులు లాగేస్తున్నాయని, అలాగే రేషన్ కార్డులు ఆపరేటర్లందరికీ సమానంగా ఉండేలా చూడాలని, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం బియ్యం సరఫరాకు కమిషన్ వేరుగా వేస్తామన్న హామీ నెరవేర్చాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు శివ, వెంకటేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

బాబా మందిర వార్షికోత్సవానికి ఏర్పాట్లు



వార్షికోత్సవానికి రంగులతో తీర్చిదిద్దిన సాయి మందిరం

రోలుగుంట: నర్సీపట్నం –వడ్డాది రూట్ నిండుగొండ కూడలి సమీపంలో గల సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఈ నెల 31న నిర్వహించేందుకు నిర్వాహకులు ఘన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం 5.15 గంటలకు కాకడ హారతితో ఈ ఉత్సవం ప్రారంభం ప్రారంభం అవుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం, సాయిమందిర కమిటీ సభ్యులు కోరారు.

బాధితులకు వరం.. వైఎస్సార్ బీమా



ఎ. కొత్తపల్లిలో వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న నేతలు

దేవరాపల్లి: వైఎస్సార్ బీమా పథకం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అన్నారు. గ్రామానికి చెందిన బుగిడి రమణ మరణించడంతో అతనికి బీమా సొమ్ము లక్ష రూపాయలు మంజూరైంది. దీనిలో భాగంగా తక్షణ సహాయం కింద రూ. 10 వేలు వైస్ ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ మృతుడి భార్య సత్యవతికి బుధవారం అందజేశారు. మిగిలిన 90 వేలు వారి ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల్లో పట్టుబడ్డ వాహనాల వేలం రేపు

చోడవరం రూరల్: చోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు చెందిన జప్తు చేసిన వాహనాలను ఈ నెల 31న వేలం వేయనున్నట్టు సబిన్‌స్పెక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు చోడవరం స్టేషన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9346755223, 9440902385 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

తనువెల్లా కనులై..



యడ్లవానిపాలెం రామాలయ కమిటీ సభ్యులకు నగదును అందిస్తున్న రామారావు



ఖండివరం రామాలయానికి మకరతోరణం అందిస్తున్న దాతలు శ్రీనివాసరావు దంపతులు

కె.కోటపాడు : గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చౌడువాడ, పైడంపేట, గుల్లేపల్లి, ఎ.కోడూరు, పాడుగుపాలెం, ఎ.భీమవరం, కె.కోటపాడు గ్రామాల్లో గల రామాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవాలతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: శ్రీరామనవమి వేడుకులను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీతారాముల కల్యాణ మహోత్సవంతో పాటు రామాలయాల్లో భారీ అన్నసమారాధనల నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఎం. అలమండలో పెళ్లిరాట మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కేజేపురం రామాలయంలో..

మాడుగుల రూరల్: కేజేపురం రామాలయంలో బుధవారం తెల్లవారుజాము 5 గంటలు నుంచి ఏకాహం ప్రారంభం అయింది. మండలంలో వంటర్లపాలెం, ముకుందపురం, ఎం. కోటపాడు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం, అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు.

మకరతోరణం అందజేత

చీడికాడ: ఖండివరంలో శ్రీ కోదండరామస్వామికి గ్రామానికి చెందిన అనపగడ్డ శ్రీనివాసరావు దంపతుల ఆర్థిక సహకారంతో వెండి మకరతోరణం బుధవారం అందజేసారు. దీని విలువ రూ. 70,000 ఉంటుందని అంచనా. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీను, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: శ్రీరామనవమి సందర్భంగా రాములవారి కల్యాణానికి రామాలయాల వద్ద పెళ్లిరాట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు.

రామాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

కె.కోటపాడు : యడ్లవానిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి కె.కోటపాడుకు చెందిన షిర్డీసాయి ఆలయ కమిటీ తరపున ఆర్థిక సహాయం అందించారు. కమిటీ చైర్మన్ వేగి రామారావు రూ.10 వేల నగదును అందించారు. కమిటీ సభ్యులు యడ్ల రమణమ్మ, యడ్ల ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

సీతారాముల పెళ్లి సర్వం సిద్ధం

బుచ్చెయ్యపేట : సీతారాముల కల్యాణ మహోత్సవానికి మండల కేంద్రం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాది, కొత్తూరు, గున్నెంపూడి, విజయరామరాజుపేట, సీతయ్యపేట, పెదపూడి, రాజాం, దిబ్బిడి, తురకలపూడి, కొమళ్లపూడి, పొట్టిదొరపాలెం, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో ముస్తాబు చేశారు.

గొర్లె కుటుంబానికి విప్ పరామర్శ

రోలుగుంట: ఉమ్మడి విశాఖ జిల్లా దివంగత మాజీ చైర్మన్ గొర్లె రామ్మూర్తినాయుడు తనయుడు జగదీష్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బుధవారం కొమరవోలు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుతో కలసి విచ్చేశారు. మరణం ఎవరికైనా తప్పదని, ధైర్యంగా ఉండాలన్నారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రాజెక్టు కరపత్రం ఆవిష్కరణ

దేవరాపల్లి: గిరి కిరణం అగ్రి ఫారెస్టు ప్రాజెక్టు కరపత్రాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వ్యవసాయ భూమిలో సేద్యం చేయించి తద్వారా రైతులకు దశలవారీగా ఆదాయం పెంపొందించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా తమ సంస్థ పని చేస్తుందని సంస్థ అధ్యక్షుడు టి. వెంకటరమణ తెలిపారు. కార్యదర్శి బి. రేవతి, కొత్తపల్లి శ్రీనివాసరావు, ఈశ్వరమ్మ, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దోషిని శిక్షించాలంటూ కొవ్వొత్తులతో ర్యాలీ

దేవరాపల్లి: ఈ నెల 19న అనుమానాస్పదంగా మృతి చెందిన జామి సింహాచలంనాయుడి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి దేవరాపల్లి ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులు, సెల్‌ఫోన్ లైట్లతో నిరసన ర్యాలీ చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధిలోపథంలో సూర్రెడ్డిపాలెం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ

కె.కోటపాడు : అభివృద్ధిలో సూర్రెడ్డిపాలెం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణాలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో జరుగుతున్న పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతు నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేయాలన్నారు. గ్రామంలో మిగిలిన ప్రాంతాల్లో ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు జరపనున్నట్లు ప్రజలకు ఆమె వివరించారు.